క్లుప్తంగా

రేపు ఓడలరేవు-కరవాక రేవుకి వేలం

అల్లవరం: ఓడలరేవు-కరవాక జాయింట్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మామిడికుదురు మండలం కరవాక పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు రేవు వేలం పాట నిర్వహించనున్నారు. ఈ విషయం పంచాయతీ కార్యదర్శి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి మార్చి 31 వరకూ రెండు నెలల కాలానికి వేలం పాట గడువు నిర్ధారించారు. వేలం పాటలో హెచ్చు వేలం పాట దక్కించుకున్న వారికి రేవులో రుసుం వసూలు చేసుకునే హక్కు కల్పించడానికి అవకాశం కల్పించారు. అయితే ఫిబ్రవరి 1 నుంచి 20 వరకు గడచిన కాలానికి వేలం పాట ఏలా నిర్ణయిస్తారని ఓడలరేవు గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఏడాది కాలంగా వేలం పాట నిర్వహించకుండా అనధికారంగా వసూలుకు పాల్పడ్డారని గ్రామస్తులు మండిపడుతున్నారు.

తెలుగు భాషను రక్షించుకుందాం



చిత్రకారుడు అంజి గీసిన చిత్రం

కాట్రేనికోన: తల్లి వంటి తెలుగు భాషను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కాట్రేనికోనకు చెందిన చిత్రకారుడు ఆకొండి అంజి అభిప్రాయపడ్డారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మాతృభాష తెలుగు ప్రాధాన్యతను తెలియజేస్తూ తెలుగును పల్లకీలో మోస్తున్న చిత్రాన్ని గీశారు.

వివాహిత అదృశ్యం

ముమ్మిడివరం: అన్నంపల్లి పంచాయతీ శివారు లక్ష్మీదేవిలంక ఒకటో వార్డు వలంటీర్‌గా పని చేస్తున్న మట్టపర్తి సావిత్రి ఈనెల 16వ తేదీ నుంచి అదృశ్యమైనట్టు ఆమె భర్త శ్రీనివాసరావు ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వలంటీర్‌గా పని చేస్తున్న సావిత్రి ఈనెల 16న సచివాలయానికి వెళ్లి, తిరిగి ఇంటికి రాలేదని, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదని తెలిపాడు. సోమవారం భర్త శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

జయలక్ష్మి బ్యాంకు అమలాపురం శాఖలో విలీనం

ముమ్మిడివరం: స్థానిక జయలక్ష్మి ఎంఎఎం కో–ఆపరేటివ్ సొసైటీ బ్రాంచ్ కార్యాలయాన్ని సీబీసీఐడీ అధికారుల బృందం సోమవారం తెరిచారు. బ్యాంకు కౌంటర్‌లో ఉన్న రూ.3,700 నగదు సీజ్ చేసి, కోర్టుకు అప్పగించారు. బ్యాంకు రుణాలు రికవరీ నిమిత్తం అమలాపురం శాఖలో విలీనం చేయడంతో వాటి తాళాలను బ్యాంకు మేనేజర్ సమక్షంలో అప్పగించారు. ఈ బ్రాంచీలో సుమారు రూ.7కోట్ల వరకు డిపాజిట్‌దారులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంత డిపాజిట్ చేశారు అనే వివరాలు బాధితులు దరఖాస్తు రూపంలో ఇవ్వగా సీఐడీ అధికారులు ఆ వివరాలను నమోదు చేసుకున్నారు.

నిత్యావసరాల పంపిణీ



బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

అల్లవరం: ఇటీవల సామంతకుర్రు అంబేడ్కర్ నగర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన నక్కా ధనలక్ష్మి కుటుంబానికి ఎంపీ చింతా అనురాధ సౌజన్యంతో చింతా కృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులు, దుస్తులు అందజేశారు. సర్పంచ్ సుందరనీడి సాయి, కర్రి శ్రీను, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు చెదళ్ల వాసుదేవుడు, టీమ్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బైపాస్ రహదారిలో ప్రమాదాల నివారణకు చర్యలు

యానాం: యానాం బైపాస్ రహదారిలో ప్రమాదాల నివారణకు సోమవారం స్థానిక పరిపాలన, పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఎన్‌హెచ్–216 జాతీయ రహదారి అధికారులతో సంప్రదించి రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, సీఐ గూటం శివగణేష్, ట్రాఫిక్ ఎస్సై పువ్వల వీరభద్రస్వామి, ఎస్సై శేరు నూకరాజు, ఏఎస్సై కవల నానాజీ ఆధ్వర్యంలో ఎదుర్లంక బాలయోగి వారధి సమీపంలో భీమ్‌నగర్ నుంచి కనకాలపేట వెళ్లే జంక్షన్ వరకూ బారికేట్లను ఏర్పాటు చేశారు. వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ సంకేతాలతో కూడిన స్టిక్కర్లను అతికించారు.

సమస్యలను పరిష్కరించాలి

యానాం: నియోజకవర్గ పరిధిలోని పరంపేట గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం అంబేడ్కర్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు బడుగు బలరామ్ రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ కొద్దిరోజులుగా తాగునీరు పసుపురంగులో అపరిశుభ్రంగా వస్తుందని, పిల్లలు జ్వరాల బారిన పడుతున్నారని, దీనిపై సంబంధిత అధికారులకు చెప్పినా స్పందించలేదన్నారు. గ్రామ వేపచెట్టు వద్ద గత కొన్ని నెలలుగా పైపు పగిలి నీరు వృథాగా పోతుందని తెలిపారు. స్థానిక పీడబ్ల్యూడీ శాఖ వారు రోడ్డు కటింగ్ మిషన్‌తో భారీ గొయ్యిని తవ్వి వదిలేశారన్నారు.

కరివేపాకు..తెల్లదోమ కాటు..

- స్థానికంగా పడిపోయిన దిగుబడి
- తప్పనిసరవుతున్న దిగుమతి



తెల్ల దోమ ప్రభావంతో గిడసబారిపోయిన కరివేపాకు



కరివేపాకు

అమలాపురం టౌన్: కూరలో కరివేపాకులా తీసిపారేశారని అంటారు కానీ.. ఆ కరివేపాకు లేనిదే వంటకాలకు రుచే ఉండదు. నిత్యం వంటల్లో ఎంతో ముఖ్యమైన కరివేపాకుకు జిల్లాలో ఇప్పుడు కటకట వస్తోంది. ఈ చెట్లను చీడపీడలు ఆశించడంతో ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి అనివార్యమైంది. ఇప్పటికే కొబ్బరికి సోకి ఆకుల పచ్చదనాన్ని.. చెట్టు తలకట్టు అందాన్ని కళావిహీనంగా మార్చేస్తున్న రూగోస్ వైట్‌ఫ్లై (తెల్లదోమ) ప్రభావం కరివేపాకు చెట్లపై కూడా పడటమే ఇందుకు కారణం. కొబ్బరి చెట్లను ఆనుకుని లేదా వాటి నీడలో ఉన్న కరివేపాకు చెట్లు నల్లగా మారి, కొత్తగా చిగుర్లు తొడక్క ఆకులు గిడసబారిపోతున్నాయి. అటువంటి ఆకు వంటకాల్లో వినియోగానికి అక్కరకు రావడం లేదు. జిల్లాలోని అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి, అంబాజీపేట మండలం తొండవరం, నందంపూడి, పి.గన్నవరం మండలం బెల్లంపూడితో పాటు రావులపాలెం, కొత్తపేట మండలాల్లోని పలు గ్రామాల రైతులు కొంతమంది కరివేపాకు సాగు చేసి, కూరగాయల దుకాణాలకు ఎగుమతి చేసేవారు. వీటికి తోడు పలు ఇళ్ల పెరళ్లు లేదా పొలాల గట్లపై కరివేపాకు చెట్లు ఉన్నాయి. దాదాపు అన్నిచోట్లా తెల్లదోమ ప్రభావం కరివేపాకుపై ఉందని కూరగాయల వ్యాపారులు చెబుతున్నారు. దీంతో వారు జిల్లాలోని కృష్ణా జిల్లా నుంచి దీనిని రోజూ దిగుమతి చేసుకుంటున్నారు.

గతంలో రూ.30.. ఇప్పుడు రూ.60

స్థానికంగా కరివేపాకు దిగుమతి లేకపోవడంతో కృష్ణా జిల్లా నుంచి బస్తాల్లో దిగుమతి చేసుకుంటున్నారు. జిల్లాకు ప్రతి రోజూ రాత్రి విజయవాడ నుంచి వచ్చే హైటెక్ లేదా ఆర్టీసీ బస్సులలో 30 నుంచి 50 బస్తాల కరివేపాకు జిల్లాకు వస్తోంది. గతంలో స్థానికంగా దొరికే కరివేపాకు కిలో రూ.30 ఉంటే ఇప్పుడు ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకునే ఆకు రూ.60 పలుకుతోంది. ఇళ్ల పెరట్లో కరివేపాకు ఉన్న వారు ఎప్పుడూ దీనిని కొనుగోలు చేసిన దాఖలాలే సాధారణంగా ఉండవు. చివరకు వారు కూడా కూరగాయల దుకాణాలకు వెళ్లి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా తరచూ వచ్చే వినియోగదారులకు కూరగాయలు కొన్నాక వ్యాపారులు కొంత కరివేపాకు ఉచితంగా ఇస్తారు. కాస్త ఎక్కువ కావాలంటే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కూరగాయల దుకాణాలకు వచ్చే వినియోగదారులు గతంలో కరివేపాకు అంతగా అడిగే వారు కాదు. ఇప్పుడు ప్రతి వినియోగదారుడూ తప్పనిసరిగా అడుతున్నారని అంబాజీపేటకు చెందిన కూరగాయల వ్యాపారి బద్రి రమణ చెప్పారు. గతంలో ఎప్పుడూ ఇతర జిల్లాల నుంచి కరివేపాకు దిగుమతి చేసుకున్న పరిస్థితి లేదని అన్నారు.

> **మూడు రకాల పిచికారీలు చేయాలి**
>
> తెల్లదోమ నివారణకు మూడు రకాల పిచికారీలు చేయాలి. కొబ్బరి చెట్ల ఆకులతో పాటు కరివేపాకు కూడా నల్లగా మారడాన్ని పోగొట్టేందుకు వేపనూనె లేదా సర్ఫ్ వాటర్ లేదా కుంకుడు కాయ నీళ్లు పిచికారీ చేయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ కరివేపాకు చెట్లపై రసాయనాలు పిచికారీ చేయకూడదు. తెల్లదోమ నివారణకు కొబ్బరి మాదిరిగానే వేపచెట్లకు కూడా బదనికలు ఉపయోగిస్తే ప్రయోజనం కనిపిస్తుంది.
>
> – వి.గోవర్ధనరావు, యంటమాలజీ సైంటిస్ట్, ఉద్యాన పరిశోధన కేంద్రం, అంబాజీపేట

అమలాపురంలో మిన్నంటిన సంబరాలు

- వైఎస్సార్ సీపీ శ్రేణుల విజయోత్సవాలు
- సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్‌లకు ఎమ్మెల్సీ పదవులతో హర్షాతిరేకాలు
- సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం



అమలాపురంలో సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న శెట్టిబలిజ, మాదిగ సామాజిక వర్గాల నాయకులు

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ నేత, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు, పార్టీ నాయకుడు, రాష్ట్ర మాదిగల పొలిటికల్ జేఏసీ చైర్మన్ బొమ్మి ఇజ్రాయిల్‌లను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఎంపిక చేయడంతో సోమవారం పట్టణంలో సంబరాలు చేసుకున్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ శ్రేణుల్లో ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి. పట్టణంలోని గడియారం స్తంభం సెంటరు, హైస్కూలు సెంటరు, సూర్యనగర్‌లో విజయోత్సవాలు జరుపుకొన్నారు. కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. హైస్కూలు సెంటరు నుంచి గడియారం స్తంభం సెంటరు నుంచి పాదయాత్ర నిర్వహించి జై కుడుపూడి, జై ఇజ్రాయిల్ అంటూ నినాదాలు చేశారు. గడియారం స్తంభం సెంటరులో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కుడుపూడికి ఎమ్మెల్సీ పదవికి ఎంపిక చేసినందుకు శెట్టిబలిజీలు, ఇజ్రాయిల్‌కు ఎమ్మెల్సీ కేటాయించినందుకు మాదిగలు పట్టణంలో విజయోత్సవాలు నిర్వహించారు. కుడుపూడి, బొమ్మి చిత్ర పటాలతో ఊరేగారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పట్టణ, రూరల్ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, బొంతు గోవింద శెట్టి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, డీసీసీబీ డైరెక్టర్ ఇళ్ల గోపాలకృష్ణ, పార్టీ నాయకులు కుడుపూడి త్రినాథ్, వంటెద్దు వెంకన్నాయుడు, చప్పిడి శోభన్‌బాబు, మున్సిపల్ కౌన్సిలర్ గొవ్వాల రాజేష్, మాదిగ నాయకులు నవుండ్రు రమేష్, మల్లవరపు శ్రీను, కె.వీరబాబు, పి.తాతాజీ తదితరులు ఈ విజయోత్సవాలకు నాయకత్వం వహించారు. ఎమ్మెల్సీల పదవుల భర్తీలో శెట్టిబలిజలు, మాదిగలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి జైజైలు అంటూ నినాదాలు చేశారు. కోనసీమలో ఒక పార్లమెంట్ స్థానం, మూడు అసెంబ్లీ స్థానాలు ఎస్సీ రిజర్వుడుగా ఉన్నప్పటికీ స్వాతంత్రంగా వచ్చిన మాదిగలకు ఇప్పటి వరకూ ఎమ్మెల్యే గాని ఎమ్మెల్సీ పదవి ఇవ్వని పరిస్థితులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తిరగరాసి మాదిగలకు అవకాశం ఇచ్చినందుకు ఆ సామాజిక వర్గీయులు కృతజ్ఞతలు తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీ



కిట్లను అందజేస్తున్న భారతలక్ష్మి తదితరులు

అమలాపురం టౌన్: ముక్త భారత్–నిక్షయ్ మిత్ర కార్యక్రమంలో భాగంగా సీఎం జగన్ ఫాలోవర్స్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ భారతలక్ష్మి మాట్లాడుతూ టీబీ రోగులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని, మందులు క్రమం తప్పకుండా వాడాలన్నారు. టీబీ రోగులకు పలు జాగ్రత్తలు సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వంటెద్ద వెంకన్నాయుడు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్ పీకే శ్రీనివాస్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు ప్రసంగించారు. అనంతరం టీబీ రోగులకు డాక్టర్ భారతలక్ష్మి, వెంకన్నాయుడు తదితరులు పౌష్టికాహార కిట్లను అందజేశారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు జల్లి సుజాత, నెల్లి సావిత్రి మేఘన, పెట్టా సత్యనారాయణ, మోరం నాని, అత్తిలి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం



అన్నదానానికి విరాళం అందజేస్తున్న దాత

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి తాపేశ్వరానికి చెందిన సలాది శ్రీసత్య నవీన్ రూ.14 వేల విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజుకు సోమవారం అందజేశారు. దాతకు ఆలయ మర్యాదలతో స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేసి ఘనంగా సత్కరించారు.

రైతులకు ఎలుకల నివారణ మందు అందజేత



ఎలుకలకు మందు రైతులకు అందజేస్తున్న అధికారులు

అల్లవరం: సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అల్లవరం రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం రైతులకు ఎలుకల నివారణ మందు పంపిణీ చేపట్టారు. 200 గ్రాముల బ్రోమోడియోలిన్ మందులో 192 గ్రాముల బియ్యం నూకలు, 4 గ్రాముల నూనె వేసి బాగా కలిపి 10 గ్రాముల చొప్పున పొట్లాలుగా కట్టి ఎలుకల బొరియల వద్ద ఉంచాలని వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు ఎలుకల మందుని పంపిణీ చేశారు. రైతులు యల్లమిల్లి వెంకటరమణ, కుడుపూడి నాగేశ్వరరావు, బొంతు మోహన్‌దాస్, కంకిపాటి నారాయణరావు, పాటి సింహాద్రి, వ్యవసాయ సహాయకులు శుభగణేష్, ఈశ్వర్, వలంటీర్లు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: అనాతవరం సచివాలయం వద్ద సోమవారం సామూహిక ఎలుకల నివారణకు బ్రొమోడిలియోన్ మందును రైతులకు పంపిణీ చేశారు. వివిధ సచివాలయ పరిధిలో జరుగుతున్న కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.వెంకటేశ్వర్లు పరిశీలించారు. అనంతరం రైతులకు మందును పంపిణీ చేశారు. ఎంపీ రామారావు, రాజశేఖర్, మండల వ్యవసాయాధికారి ఎస్. ప్రశాంతకుమార్ డి.మహిత, ఎం.ప్రీతి, రైతులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి గ్రామంలో సోమవారం రైతులకు ఎలుకల నివారణ మందు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని రైతు భరోసా కేంద్రాల గుంటూరు కార్యాలయం డీడీఏ డి.వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు ఎమ్.షంషి, ఎ.రాజశేఖర్, ఎం.వి.రామారావు, ఏవో జి.కుమార్‌బాబు, వీఏఏ ఎమ్.రవిచంద్ర, రైతులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: పాలగుమ్మి రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం రైతులకు ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని వ్యవసాయసహాయ సంచాలకులు ఎంఏ షంషీ పర్యవేక్షించారు. ఏఓ ధర్మాప్రసాదు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

జేసీఐ అమలాపురం అధ్యక్షురాలిగా సౌమ్య



ప్రమాణ స్వీకారం చేస్తున్న సౌమ్య

అమలాపురం టౌన్: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) అమలాపురం శాఖ నూతన అధ్యక్షురాలిగా గుబ్బల సౌమ్య ఎన్నికయ్యారు. స్థానిక విద్యుత్ నగర్‌లో సోమవారం జరిగిన జేసీఐ సమావేశంలో అమలాపురం శాఖకు నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. చేత జేసీఐ చార్టర్ అధ్యక్షురాలు మాకిరెడ్డి పూర్ణిమ ప్రమాణం స్వీకారం చేయించారు. జేసీఐ కార్యదర్శిగా త్సవటపల్లి సుష్మిత, కోశాధికారిగా తోరం విజయ ఎన్నికయ్యారు. జేసీఐ మాజీ అధ్యక్షుడు మాకిరెడ్డి మనోజ్, జేసీఐ ప్రతినిధులు నల్లా పవన్, వాడ్రేవు శ్రీరామ్, ఆకొండి పవన్ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

ఉప్పునీరు పోటెత్తడంతో అడ్డుకట్ట తొలగింపు



అడ్డుకట్టను తొలగించి ఉప్పునీటిని మేజర్ డ్రైన్లలోకి వదులుతున్న రైతులు

ఉప్పలగుప్తం: వరి చేలలో ఉప్పునీరు పోటెత్తడంతో గొరగనమూడి మీడియం డ్రైన్‌పై ఇటీవల సాగునీటి ఎద్దడిని నివారించడానికి ఏర్పాటు చేసిన క్రాస్‌బండ్ (అడ్డుకట్ట)ను సోమవారం రైతులు కొంత మేర తొలగించారు. మండలంలోని సన్నవిల్లి, పెదగాడవిల్లి గ్రామాల్లో డ్రైన్లను ఆనుకొని ఉన్న ఆక్వా చెరువుల ఉప్పునీటిని డ్రైన్లలోకి తోడడంతో ఆ నీరు పోటెత్తి దిగువ ప్రాంతంలో ఉన్న ఉప్పలగుప్తం, వాడపర్రు గ్రామాల్లోని వరిచేల్లోకి చేరింది. ఈ విషయాన్ని ఆయకట్టు రైతులు ఏవో కుమార్‌బాబుకు తెలియజేయగా, ఆయన వెంటనే స్పందించారు. డ్రైన్ల అధికారులకు విషయం తెలియజేశారు. ఆలస్యమయ్యే కొద్ది వరి చేలు పాడైపోతాయని రైతులు అడ్డుకట్టను కొంత మేర తొలగించి ఉప్పునీటిని కూనవరం మేజర్ డ్రెయిన్‌లోకి వదిలారు.

మాదిగ ఉద్యోగుల సమాఖ్య నూతన కమిటీ ఎన్నిక

అమలాపురం రూరల్: మాదిగ ఉద్యోగుల సమాఖ్య అమలాపురం డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా మట్టా నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈదరపల్లి దాబా గార్డెన్స్‌లో మాదిగ ఉద్యోగుల సమాఖ్య సమావేశం సోమవారం జరిగింది. సమాఖ్య జాతీయ కోశాధికారి డాక్టర్ దూళ్లపల్లి సుబ్బారావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తాతపూడి వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉందుర్తి వీర వెంకటరావులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా ఈవీవీ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ముమ్మిడివరపు వెంకటేశ్వరరావు, కోశాధికారిగా సవరపు చంటిబాబు, సంయుక్త కార్యదర్శులుగా ముస్కూరి నరసింహస్వామి, ర్యాలీ వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



తాళ్లరేవు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం

తాళ్లరేవు: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక సూర్య భాస్కర కల్యాణ మండపంలో జరిగిన ‘మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగుతుందన్నారు. ప్రభుత్వం చేసిన లబ్ధిని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీని కోసం పార్టీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులను నియమించిందన్నారు. పార్టీ ఆదేశానుసారం గృహ సారథులు, వలంటీర్లు తమ పరిధిలోని 50 కుటుంబాలకు పథకాలపై ప్రచారం చేయాలన్నారు. తాళ్లరేవు మండలంలో త్వరలో పార్టీ కార్యాలయం ప్రారంభించనున్నట్టు తెలిపారు. సీఎం జగన్ నేతృత్వంలో ముమ్మిడివరం నియోజకవర్గానికి రూ.1200 కోట్లు తీసుకువచ్చి అభివృద్ధి చేసినట్టు వివరించారు. రాబోయే రోజుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా చేపడతామని, మండలంలో సుమారు 50 రోజుల పాటు రెండు పూటలా కార్యక్రమం జరుగుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు పార్టీకి సమయం కేటాయించాలన్నారు. మార్చి 18 నుంచి 25వరకు ఏడు రోజులపాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమం జరుగుతుందన్నారు. దీనిలో భాగస్వాములవ్వాలని కోరారు. రాబోయే రోజుల్లో ముమ్మిడివరంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురుతుందన్నారు. పవన్ కల్యాణ్‌కు ఏం చేయాలో తెలియదని, రాష్ట్రంపై అవగాహన లేదన్నారు. చంద్రబాబు నెగ్గిన తరువాత ఏం చేస్తారో చెప్పడం లేదన్నారు. అతని తనయుడు లోకేష్ ఎందుకు పాదయాత్ర చేస్తున్నాడో అతనికే తెలియదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్దనరావు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాద గోవిందకుమార్, రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీలు ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి లలిత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో తూర్పులంక క్రీడాకారుల ప్రతిభ



తైక్వాండో విజేతలు వీరే..

అల్లవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కాకినాడ స్టేడియంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి 28వ ఇంటర్ క్లబ్ తైక్వాండోచాంపియన్ షిప్ పోటీల్లో అల్లవరం మండలం తూర్పులంక గ్రామానికి చెందిన మచ్చా షణ్ముఖసాయి శ్రీకర్, ద్వితీయ స్థానం, షణ్ముఖ సాయి శరణ్య తృతీయ స్థానంలో నిలిచారు. తైక్వాండోలో శ్రీకర్, శరణ్య ఉత్తమ ప్రతిభ కనబరిచి రజత, కాంస్య పతకాలు సాధించారని జిల్లా అసోసియేషన్ కార్యదర్శి బి.అర్జునరావు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో రెఫరీలు భార్గవి, శ్రీకళ, వైష్ణవి పాల్గొన్నారు. విజేతలు శ్రీకర్, శరణ్యలను ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్ కడలి గంగాచలం తదితరులు అభినందించారు.

సాగునీరందించాలని రాస్తారోకో

- హైవేపై రైతుల బైఠాయింపు
- ట్రాఫిక్‌కు అంతరాయం

తాళ్లరేవు: పి.మల్లవరం, నీలపల్లి పంచాయతీలలోని శివారు భూములకు సాగు నీరందక వరి చేలు ఎండిపోతున్నాయని, పూర్తి స్థాయిలో నీటిని సరఫరా చేయాలని కోరుతూ రైతులు 216 జాతీయ రహదారిపై సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో పోలేకుర్రు ఇరిగేషన్ కాలువ వద్ద రోడ్డుపై రైతులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సాగునీరు అందించి మా పొలాలను రక్షించండి మహాప్రభో అంటూ నినదించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా నీటి కోసం ఆందోళన చేస్తున్నప్పటికీ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే రైతులు ఎకరానికి రూ.25 వేలకు పైగా పెట్టుబడి పెట్టారని, వరి చేలు ఎండిపోతే తీవ్రంగా నష్టపోతారన్నారు. నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్న ఇరిగేషన్ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సుమారు అర గంట పాటు సాగిన ఈ ఆందోళన వల్ల జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ బృందం అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ కార్యక్రమంలో ధూళిపూడి వెంకటరమణ, మోర్త రాజశేఖర్, మహేష్, టి.ఈశ్వరరావు, చిన్న, సన్నకారు, కౌలు రైతులు పాల్గొన్నారు.

యువకుడి మృతి

అమలాపురం రూరల్: మోటారుసైకిల్‌పై వెళుతున్న యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన భట్నవెల్లి గ్రామంలో సోమవారం తెల్లివారు జామున జరిగింది. తాలుకా ఎస్సై అందే పరదేశి తెలిపిన వివరాల ప్రకారం.. ముమ్మిడివరం అగ్రహారానికి చెందిన కట్టా అజయరామ్(29) తన మోటారుసైకిల్‌పై ఆదివారం సాయంత్రం సినిమా చూసేందుకు అమలాపురం వచ్చాడు. సెకెండ్ షో చూసి తిరిగి ఇంటికి ముమ్మిడివరం వెళుతుండగా భట్నవిల్లి గ్రామం తోకలవారిపేట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతని మృతి వార్త విని కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. మృతుడి తండ్రి ఉమామహేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఎస్సై అందే పరదేశి సోమవారం రాత్రి తెలిపారు.

రవికుమార్‌ను అరెస్టు చేయాలని ఫిర్యాదు

కాట్రేనికోన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యేపై అనుచిత వాక్యలు చేసిన చీకురుమిల్లి రవికుమార్‌ను తక్షణమే అరెస్టు చేయాలని మండల వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం కాట్రేనికోన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముమ్మిడివరం ఎమ్మెల్యేను అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా ఆయన సామాజక వర్గంపై వ్యక్తి గత దూషణలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సామాజిక వర్గాల మధ్య చిచ్చుపెట్టేలా సామాజిక మాధ్యమాలలో పోస్టు పెట్టడంపై మండి పడ్డారు. కాట్రేనికోన ఎస్సై శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేసిన వారిలో నాతి సత్యనారాయణ, పాలెపు ధర్మారావు, కాశి హనుమంతరావు, సంగాని పోతురాజు, అయితాబత్తుల శ్రీను, సాపే సూర్య ప్రకాష్, జనిపెళ్ళ శ్రీను, నందిక శ్రీను, పాలెపు సత్యం, మూదే నూకరాజు, మూదే భాస్కరరావు, బొమ్మిడి సూరిబాబు తదితరులు ఉన్నారు.

ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు

యానాం: పుదుచ్చేరిలో ఐదుగురు ఐఏఎస్ అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం డిప్యూటీ సెక్రటరీ జయసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పుదుచ్చేరి కలెక్టర్ ఇ.వల్లవన్, వ్యవసాయ కార్యదర్శి ఎల్.కుమార్, గ్రామీణాభివృద్ధి కార్యదర్శి ఎ.నెడుంజెళియన్ ముస్సోరికి ప్రత్యేక శిక్షణ నిమిత్తం వెళుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో పలు శాఖల బాధ్యతలను అయిదుగురి ఐఏఎస్‌లకు అప్పగించారు. ఎ.ముత్తమ్మకు విద్యుత్, ఫైనాన్స్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు, బి.జవహర్‌కు పర్యాటక, స్థానిక సంస్థల శాఖను, మణికందన్‌కు రెవెన్యూ, పబ్లిసిటీ శాఖను, ఎస్.రాజుకు వాణిజ్యశాఖను, రజిత్‌గుప్తాకు ఎనర్జీశాఖను అదనపు బాధ్యతలు అప్పగించారు.

అసైన్డ్ భూమిని లబ్ధిదారులకు ఇప్పించాలి

తాళ్లరేవు: కోరంగిలో సర్వే నంబర్ 276–1, 276–30 వరకూ ఉన్న 70 ఎకరాల అసైన్డ్ భూమిని తిరిగి లబ్ధిదారులకు ఇప్పించాలని పలువురు కోరారు. సోమవారం విలేకర్ల సమావేశంలో వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములు తిరిగి లబ్ధిదారులకు ఇప్పించాలని ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త కోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు మాట్లాడారు.

ఏఐసీసీ సభ్యునిగా అబ్బాయి

ఉప్పలగుప్తం: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) కో–ఆప్షన్ సభ్యుడిగా స్థానిక గ్రామానికి చెందిన చీకట్ల అబ్బాయి నియమితులయ్యారు. ఆ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నుంచి ఉత్తర్వులు అందాయని చీకట్ల అబ్బాయి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తనకు పదవి రావటానికి కృషి చేసిన ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పోలిశెట్టి హరిబాబు, దోనిపాటి విజయలక్ష్మి, దామిశెట్టి జయ, నిమ్మకాయల నాగేంద్రప్రసాద్, ఆకుల వెంకట రెడ్డినాయుడు, జోగి అర్జున్‌రావు, అరిగెల వాసు తదితరులు అబ్బాయికు శుభాకాంక్షలు తెలిపారు.

పందులకు వ్యాధి నివారణ టీకాలు

ఉప్పలగుప్తం: ఇటీవల క్లాసికల్ స్వైన్ ఫీవర్ వ్యాధితో పందులు అధికంగా మృత్యువాత పడుతుండడంతో భీమనపల్లి పశువైద్యాధికారి నిరోషా ఆధ్వర్యంలో సోమవారం పెదగాడవిల్లిలో వ్యాధి నిర్మూలన టీకాలను వేశారు.

స్వాంపు ఏరియాలో చేపలు మృత్యువాత

ఉప్పలగుప్తం: ఎస్.యానం తీర ప్రాంత స్వాంపు ఏరియాలో తరచూ చేపలు, రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. స్థానికంగా ఉన్న రవ్వ ప్లాంటు వ్యర్థాలు, ఎగువ ప్రాంతంలో ఉన్న ఆక్వా చెరువుల రసాయన వ్యర్థాల వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానిక మత్స్యకార పెద్ద అంగాని అర్జునరావు సోమవారం తెలిపారు. ఇలాగే ఉంటే ప్రజలు అనారోగ్యంపాలవుతారని భయాందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితిపై పూర్తి అవగాహన కోసం వాటర్ నమూనాను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిచారని అర్జున్‌రావు తెలిపారు.